# కరె నాగయ్య

ఆయప్ప తన పెండ్లి నాడన్నా సొక్కా తొడుక్కున్నాడో లేదో మల్ల, యెప్పుడు సూసినా ఉత్త పెయితోనే వుంటాడు. రొమ్మునా, యీపునా, రొండు బుజాల మీనా నల్లంగ యింతింత పొడుగు ఎంటికల్తో ఎనుంగొడ్డు[1] మాదిరుంటాడు. ఇంటికి సుట్టాలొచ్చినప్పుడు గూడా సొక్కా తొడుక్కోంగా యెవురూ సూడలా. ఒకసారి ఆయప్ప పెండ్లామూ, కొడుకులూ పోరి పోరి ఒక సొక్కా కుట్టిచ్చినారు. ఆ సొక్కా కుట్టిన మిస్నీ[2] రసూలు "కరెనాగయ్య సొక్కా పట్టిచ్చుకొన్నాడో" అంటా ఊరందరికీ దండోరా యేసినట్టు సెప్పె. "అయితే కరెనాగయ్య ఇంగ సొక్కా తొడుగుతాడన్న మాట" అని అందరూ నగుతా అనుకొంటా వుంటే, ఆ మనిసి అందర్నీ మోసం జేసి సొక్కా తొడక్కనే పాయె.

"సొక్కా కుట్టిచ్చినాం గదా తొడుక్కో" అని ఇంట్లో వాళ్ళు అంటే ........ "ఇప్పుడెవురి పెండ్లి అయితాందాదని సొక్కా తొడుక్కోని మాసిపోకుండా మంచమెక్కి కూకొనేది" అనడిగె. ఆ యెవురి పెండ్లో అయితాండేతప్పుడు తొడుక్కోమంటే "ఎవురి పెండ్లికో నేను సొక్కా తొడుక్కోక పోతేయేం ?" అనీ అనె ! కరె నాగయ్య సొక్కా కత యింతటితో అయిపోలా, యింగా వుంది. "ఏంది నాగయ్యా ! యాభై అర్రై ఎకరాల అసామిని, రొండు మూడు లచ్చలు వొడ్డీలకు తిప్పుతాండావు ! సొక్కా గూడా లేకండా ఊరంతా తిరుగుతాంటే సీద్రం గాదా ?" అని ఎవురన్నా అడిగినప్పుడు నాగయ్య సెప్పేది తెల్చునా ?

ఆ మనిషి వారుసైనోడయితే "ఒరే నాయాలా!" అనో, ల్యాకపోతే "ఒరే అబ్బీ !" అనో పిల్చి మొదులు పెడ్తాడు. "నేనీ ఊరికి కొత్తోనిగాను. సొక్కా తొడుక్కోకపోయినా వొల్లె కట్టుకోకపోయినా నాకెంత బూమి వుండేదీ, ఎంత లెక్క వుండేదీ అందరికీ తెల్చు. నేను సొక్కా తొడుక్కోలేదని అయి యాడికీ పోవు. తొడుక్కుంటే అంతకంతా ఉబికేదీ లేదు. ఇంగెందుకు రా లేనిపోని యేసికాలు ?" అని తేల్చుతాడు. "ఉండూర్లో సరే .... నువ్వు జెప్పినట్టే వుండు. పొద్దుటూరుకు పోయినప్పుడన్నా సొక్కా తొడుక్కోగూడదా ?" అన్నామనుకోండి ..... అప్పుడేం జెప్తాడు ?

"ఒర్నీ పాసుగూలా ! ఒకూరి రెడ్డి ఒకూరికి పసుల పోలిగాడు ! అందులో అది ఊరు కూడా గాదు ప్యాట[3] అయిపాయె. ఆడ నేనెవురికి తెల్చు ? ఆడ నేను సొక్కా తొడుక్కోని వుంటే ఎవునిగ్గావాల? ల్యాకపోతే యెవునిగ్గావాల ? సొక్కా తొడుక్కోని వస్తే ఆ ప్యాటోల్లు సిమ్మాసనం యేసేదీ లేదు, తొడుక్కోలేదని పోలీసోల్లు జైల్లో యేసేదీ లేదు గదా. ఇంగ యాల సొక్కా ?" – ఇట్టాటి మనిసికి సొక్కా తొడిగేది యెవురి సేతయితాది ?

అయితే, సొక్కా తొడుక్కోమంటే యిట్టాటియన్నీ సెప్తా వుండాడని కరె నాగయ్య యేందో గాందీ మహాత్ముడనుకునేరు, ఉత్త పనికిమాల్నోడు ! వాళ్ళ వాళ్ళు సొక్కా కుట్టిచ్చి తొడుక్కోమని మొత్తుకొంటే, కాలికేస్తే ఏలికీ, ఏలికేస్తే కాలికీ ఏస్తా ఏడిపిస్తా వుండాడు గదా. ఎవురన్నా రొంత తెల్లసొక్కా తొడిగితే తాను ఏడుస్తాడు. ఏ మాలోళ్ళ పిల్లాడో కిసుమస్సో, జనవరి పండగో అని పనుల్జేసి సంపాయిచ్చుకొన్న లెక్కతో తెలతెల్లంగ కనపడే సొక్కా కుట్టిచ్చుకొని తొడుక్కున్నాడనుకోండి .... ఇంగ కరె నాగయ్య కంట్లో కారం పన్నెట్టే ! "మాల్నాకొడుకులు గూడా తెల్ల సొక్కాలేసుకుని తిరగబడ్తే ఇంగ ఊరు నాశనమే" అంటా వుంటాడు.

---

1) ఎలుగుబంటి 2) కుట్టుమిషన్ 3) పేట

తన కాడ పన్జేసే వాళ్ళు అడిగినా యెన్నడన్నా ఎంగిలి బీడీ యిచ్చిన పాపాన పోలా. "ఒరే బీడీ కాడ దారం కట్నారు సూడు, ఎందుకని ?" అని ఆ బీడీ అడిగినోన్ని పెశ్న ఏస్తాడు. బీడీ యియ్యనోని పెశ్నకు యేం జవాబు సెప్పబుద్ధి పుట్తాది ? వాళ్లు సూస్తా వూరుకుంటే తనే సెప్తాడు. "బీడీకి దారం కట్టేది ఎందుకంటే ఆడిదాంకా తాగండ్రా అని. మల్ల నేను ఆడిదాంకా తాక్కుండా యిస్తే తప్పు గదా! అవతల నాకు బీడీలు పుడ్తాయా?" యిట్టా ! తనను బీడీ అడిగితే సెప్తాడు గదా, తన్దగ్గర ల్యాకపోతే ఏం జేస్తాడని ? దావన ఎవుడు పోతాంటే వాన్ని పిల్చి "రే, నే జెప్పినానని ఆ సెన్నయ్య అంగడికాడికి పోయి ఒకగ్గిపెట్టె, బీడీ కట్ట తీసుకొని బిరీన రాపో" అని ఆర్డరు ఏస్తాడు.

వాని కరుమగాలి ఎవడన్నా తెచ్చిపెట్నా. "ఏంరో బీడీకట్ట, అగ్గిపెట్టె లెక్కేదీ?" అని సెన్నయ్య తగులుకొంటాడు. "కరె నాగయ్య యియ్యాలా!" అంటే "సర్లె కరెనాగయ్య లెక్కిస్తాడా, ఎర్రి నా కొడకా ! నాకెందుకు తీసకపోయినోడి. నువ్వే యియ్యాల" అంటాడు. కరెనాగయ్య నడిగితే "ఏ పొద్దు ? యాడ జెప్పినా ?" అని లచ్చ పెశ్నలేసి "అవు, నా పేరు జెప్పి తీసకరామన్నాను గానీ లెక్కిస్తానంటినా?" అని అవులయకు దిగుతాడు. ఆకిరికి "యిస్తాలేరా యెదవ బీడీకట్టా అగ్గిపెట్టె లెక్కకు యింత ఆసామిని నన్ను అడుగుతారా ? ఆ లెక్కకు రోంత ఆల్చెమయితే అంగడోడు సచ్చిపోతాడా, నువ్వు సచ్చిపోతావా ?" అని రోసానికి పోతాడు. ఆల్చెమైతే మీరు సచ్చిపోతారా అని అడిగినోడు, యిస్తే తను సచ్చిపోతాడా అనుకోడు !

ఇయట్టా వుండంగా యింగ తిండా అంటే, యెప్పుడూ కారెం సంగటే. "వరి బువ్వ తిన్నా తిన్నట్టే వుండదు. థూ! సంగట్లో వుండే సారం దాంట్లో యాడుండాది" అంటాడు. మల్లా ఆ ఊళ్ళో యీ ఊళ్ళో తనకాడ వొడ్డీలకు లెక్క తీసకపోయినోళ్ళ యిండ్లకు పోయి కోడిసియ్యలూ, వరి బువ్వా గొంతుదాకా మెక్కి వస్తాడు. అట్ల పెట్టకపోతే, అప్పిచ్చిన లెక్క నాకు అక్కరుంది యియ్యమంటాడేమోనని పాపం వాళ్ళ బయం ! అందుకని అప్పోసప్పో చేసి వాళ్ళు ఆ తిండి పెడ్తారా, పెట్నారులే పాపం ! అనుకోడు. "సిల్లర నా కొడుకులు, ఎచ్చులకు పోతారు ! అట్ల కర్సు సేయబట్టే వాళ్ళు అట్టుండేది, కర్సు సేయకపోబట్టే నేనింత సంపాయిచ్చింది" అదీ పై ఏటు !

ఎప్పుడన్నా కూలోళ్ళు అంతకుముందు యెవురికన్నా పనికి ఒప్పుకొనో, యింగేదన్నా ఇబ్బంది పడో తనగ్గానీ పనికి రాకపోతే... సూడాల. "కూల్నాకొడుకులకు కొవ్వెక్కినాది, కరువొస్తే గానీ ఈళ్ల కొవ్వు కరగదు" అని తిట్లు ! ఎప్పుడూ కరువొస్తానే వున్నా ఆయప్ప ఇంగా కరువు రావాలని కోరుకొంటా వుంటాడు. ఏదో ఒకేడు పండితే సాలు తన కడుపు మండిపోతాది. ఇట్లా పండితే ఇంగ ఊళ్ళో జనం మాటయింటారా ? అని ఏడ్సి సస్తాడు. కరువొస్తే ఎక్కువొడ్డీకి అప్పులిచ్చి తీర్సల్యాకపోతే బూములు పొరబందు[5] కోవచ్చని కరె నాగయ ఆలోసెన !

అంత సంపాయిచ్చినా తిండి తినక గుడ్డ కట్టక యీనంగా బతికే కరె నాగయ్యన్జూసి "ఏట్నిండా నీళ్ళున్నా కుక్కకు గతుకుడు నీళ్ళే గతి" అంటా వుంటారు ఊళ్ళో. అంతేగాదు కరె నాగయ్యను యిప్పుడు కరువు నాగయ్య అంటా వుండారు. ఆయప్ప "కరువు రావాల కరువు రావాల" అంటా వుంటాడని ఆ పేరు పెట్టినట్టు కనిపిస్తాది గానీ లోతున ఇంగో అర్తం వుందేమో మల్లా ! ఊళ్ళో అందరికీ కరువు రావాలని అనుకొంటా వుండాడు గానీ, అస్సలుకు యెప్పుడూ ఆయప్పది కరువు బతుకే గదా.

4) హాస్యాలకు 5) ఆక్రమించు